# కుసుమిత సమయం

"అమ్మా! నీకిష్టమేనా?" అనడిగిన నాన్న ప్రశ్నకు తలవంచుకుందే గానీ సత్యవతి ఏమీ సమాధానం చెప్పలేదు. లోతుకు పోయిన ఆయన కళ్ళల్లో ఆశ కనిపిస్తోంది. బక్క చిక్కిన ఆ మనిషి గద్గదస్వరంతో యిల్లా అడుగుతోంటే, సత్యవతి కళ్ళలో నీళ్ళు తిరగాయి. అతి మెల్లిగా తలూపింది. ఆయన యింక నిలబడకుండా వెళ్ళిపోయినాడు. ఖంగుమని అవతలి వసారాలో ఆయన దగ్గిన దగ్గు ఆమె చెవుల్లో భయంకరంగా గింగురుమన్నది.

నెలరోజుల క్రితం ఆయన, ఆయన తల్లి పెళ్ళి చూపులకి వచ్చి, తనని చూశారు. యిరుగు పొరుగు వారంతా ఆయన్ని చూశారు. "శుభ్రంగా వున్నాడు పెళ్ళి కొడుకు. ముప్ఫై ఏళ్ళు దాటిన వయస్సే కనబట్టం లేదు" అన్నారు. అమ్మ ఎంత చెప్పవద్దనుకున్నా అందరికీ తెలిసిపోయింది. ఆయన రెండో పెళ్ళి చేసుకుంటున్నారని. ఆమెకి – అంటే – తనకి కాబోయే సవతికి పన్నెండు సంవత్సరాలైనా పిల్లలు లేరుట. యింక పుట్టరని డాక్టర్లు తేల్చి చెప్పారు. అందుకే వాళ్ళు నిశ్చయించుకున్నారుట – మరో పెళ్ళి చేసుకోవాలని.

ఈ సంబంధం సంగతి వినగానే అమ్మ వద్దని గట్టిగా అన్నది. ఆ తర్వాత పరిస్థితి మెల్లిగా గ్రహించుకొని వప్పుకొన్నది. ఎవరికి ఎల్లా రాసి పెట్టి వుంటే అల్లాగే జరుగుతుంది అనుకొన్నది. నిక్షేపంలాంటి ఆస్థిపరుడు, చిన్నవాడు. మనసారా కావాలని చేసుకుంటున్నాడు అని సమాధాన పరచుకొంది.

చివరి కొరత కూడా లేకుండా నాన్న తనని అడిగి కనుక్కున్నాడు. ఇరవైరోజుల వ్యవధిలో ముహూర్తం కుదిరింది. వాళ్ళు తొందరపడ్తున్నారు. జబ్బుతో తీసుకొంటున్న నాన్నకి ఇల్లు మినహా మరొక ఆధారం ఏమీ లేదు. బడి పంతులు ఉద్యోగం వల్ల పట్టుమని అరవై రూపాయలు రావు. సత్యవతి తరువాత నల్గురు.

తమ్ముళ్ళు ఒక చెల్లెలు – వీళ్ళందరి బ్రతుకులు ఏమి కావాలో ఆయనకి అర్థం కావడం లేదు. సత్యవతి కన్నె చెర యీ నాటికి వదులుతున్నందుకు ఆయనకి రాత్రిళ్ళు కాస్తసేపైనా కునుకు ఉంటున్నది.

ఇల్లు తనఖా పెట్టి తెచ్చిన వెయ్యిరూపాయలతోనే పెళ్ళి జరుగవలసి ఉన్నది. పసుపు, కారం కొట్టించి, అప్పడాలు, వడియాలు, పెట్టించింది అమ్మ.

సాయంత్రం పూట మల్లెపూలు జడలో ముడుస్తూంటే సత్యవతికి ఆయనను గురించిన జ్ఞాపకం మనస్సులో మెదిలింది. లజ్జ, చిన్న పులకరింపు ఎన్నడూ తెలియని భావాల్లా కదిలాయి.

... అలవాటు ప్రకారం పనివాళ్ళు తోటనుంచి పూలు తెచ్చి పోశారు. అవి మాలలు కట్టాలని ఎవరికి, జడలో ముడుచుకోవాలని ఎవరికి? రుక్మిణి పూలన్నీ బల్ల మీద పోసి, గోడకు తల ఆన్చుకుని గుండెను గట్టిగా అదిమి పట్టుకొన్నది. ఆయన వస్తున్న అలికిడి విని చటుక్కున కళ్ళు తుడుచుకుని పూలు సవరించసాగింది. తలుపు వరకు వచ్చి, ఆయన వెనక్కి తిరిగి వెళ్ళి పోయారు. వెళ్ళి వసారాలో నిలబడి కండువా కావాలని పని వాడితో కబురు పెట్టారు. బీరువాలోంచి తీసి పంపించింది రుక్మిణి.





వాళ్లకి కబురు వెళ్ళింది. ముహుర్తం తేదీ నిశ్చయమైంది. "ఒసే రుక్మిణీ!" అంటూ తనని కేక వేస్తూ ఆపనీ, యీపనీ చెబుతోంది అత్తగారు. ఎల్లుండి పట్నం వెళ్ళి బట్టలు కొనాలి అనుకున్నారు. ఆయన మేనత్త వాళ్ళు. "అదీ వస్తుంది. మంచి నాణ్యం తెలుసు బట్టలు" అన్నారు అత్తగారు. ఆ మాట విన్నప్పుడు తన ఖర్మని తలుచుకుని ఏడ్చింది రుక్మిణి. కాబోయే పెళ్ళికూతురికి సరిపడే చీరెలు తను ఎన్నిక చేయాలి.

గోపాలరావు నాలుగు నెలల క్రితం మంచం మీద కూర్చుని రుక్మిణిని అడిగాడు "ఏమంటావు?" అని. పడుకుని ఉన్న ఆమె వెనక్కి తిరిగి, గోడలోకి చూస్తూ కళ్ళల్లో నీళ్లు నింపుకుంది. అతనికి తెలుసు ఆమె సమాధానం. రెండు సంవత్సరాలుగా అత్తగారు ఆమెని ఎన్నో విధాలుగా మాటలు అంటోంది. ఎందుకూ పనికి రాని చెట్టు యింట్లో ఉందేమిటి అన్నట్లు. ఫలమివ్వని చెట్టుని కొట్టేస్తే పాపమేమిటి అన్నట్లు ఏదో వ్యంగ్యంగా అంటుంది. భగవంతుడు ఎందుకింత బాధ తనకి రాసి పెట్టాడో తెలియదు. ఏ జన్మలో ఎవరికి ద్రోహం చేసిందో తను యీ జన్మలో బ్రతికుండగానే నిలువునా చీల్చివేస్తోంది. మనిద్దరం కలిసి ప్రయాణం చేద్దాంరా అని పూల పడవ ఎక్కించి, నడిఏటిలో చటుక్కున త్రోసివేస్తున్నారు తనని.

"నేనేమి కావాలండీ మరి?" అని తను కన్నీళ్ళతో అడిగితే ఆయన చటుక్కున "ఇక్కడే వుంటావు. ఏమౌతావు?" అన్నాడు.

"నేనుండలేను" అని ఏడిచింది. దగ్గరకు తీసుకోకుండా దూరంగా జరిగాడు.

ఆరోజు ఆమె అటు తిరిగి పడుకోగానే, లేచి అవతలకు వెళ్ళి డాబా గోడనానుకుని నిలబడ్డాడు అతను. "ఇటు చూడు, లేచి కూర్చో" అని కొంచెం గట్టిగా అన్నాడు. లేచి కూర్చుంది రుక్మిణి. "నీకు ఎన్ని విధాల చెప్పినా బుద్ధి వచ్చేటట్లు కనబడటం లేదు. నీకేమీ లోటు జరగనివ్వనని చెబితే అర్థం కాదా? ఈ యింట్లో నీ తర్వాతనే మరో మనిషి. ఇది నేనేదో కొత్తగా తెచ్చి పెట్టినట్లు ఏడుస్తావేం? మన ఎరికలో ఎంతమంది లేరు – అప్పా చెల్లెళ్ళలాగ సఖ్యతగా, హాయిగా వుంటున్నారు" అన్నాడు.

రుక్మిణి కళ్ళు వప్పగించి చూస్తూ కూర్చున్నది. ఏమీ సమాధానం చెప్పలేదు.

"నువ్వు యిష్టం లేదని పదిసార్లు మొండిగా అన్నంతలో సమస్య ఏమీ తీరదు. డాక్టరు దగ్గర్నించి సర్టిఫికేటు తెచ్చుకుంటే, నీ అడ్డమే లేదు. న్యాయ ప్రకారం నిన్ను అడగాల్సిన పని లేదు నాకు. కానీ నేను అడుగుతున్నాను. నా మేలు కోరి, యిందుకు వప్పుకుంటావని అడిగాను. నీకా ధ్యాసే కనబడలేదు."

ఆయనతో కలసిమెలసి మరొక మనిషి మసలుతోంటే తను ఎల్లా కళ్లార చూస్తూ సహించగలదు? ఒక్క క్షణం ఆయన ఎవరి వంకైనా కుతూహలంతో, ఆకర్షణతో చూస్తేనే మనస్సు విలవిలలాడేది. అటువంటప్పుడు తనని త్రోసి పారేసి, ఆయన మనస్సుకి శరీరానికి మరో మనిషి అధికారం వహిస్తే తను ఏమౌతుంది? ఆయనకి ఎల్లా అర్థమౌతుంది? ఇంట్లో మరో మనిషి వచ్చిందనుకో అంటే అది సమాధానం అవుతుందా?

ఉన్నట్లుండి తన ఉనికిని కాదన్నట్లున్నది.

"నీ స్వార్థమే చూసుకొంటావు గానీ, యీ వంశానికి ఒక నలుసు ఉండాలనీ, యిది నాశనం కాకూడదని నీకేమైనా ఉందా? మళ్ళీ ఏదో ఒక వాదనకి దిగకు. దత్తత మనకి పనికి రాదు. మా అమ్మకి అది

ముప్పు. జాతక ప్రకారం అది తెలిసి కూడా మళ్ళీ మళ్ళీ ఆ మాటే అన్నావంటే నువ్వు మనిషివే కాదు. రాక్షసివి" చాలా తీవ్రంగా మాట్లాడాడు గోపాలరావు..

ఆయన కళ్ళల్లో అసహ్య భావం కనిపించింది. అటువంటి భావం రుక్మిణి ఎప్పుడూ చూడలేదు. ఇన్ని సంవత్సరాలుగా లేనిది ఇప్పుడు ఎంత కంటకమై పోయింది తను!

ఇంక వాళ్ళు రుక్మిణిని సంప్రదించలేదు. ఇంట్లో జరిగే శుభకార్యం కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని పనులతో బాటు యివీ తన మీద పడుతున్నాయి. పుట్టింటికి వెళ్ళిపోదామని శత విధాలా ఆమె ప్రయత్నించింది. తను సిద్ధమవుతోంటే ఆయన పెద్దగా అరచి కేకవేశారు. "అమ్మ ముసలిది, నడుం వంగిన మనిషి ఎల్లా చేసుకుంటుందనుకుంటున్నావు? అసలు తోచలేదూ నీకూ? ఇవన్నీ ఎవరు చేస్తారని!" అంటూ. ఆవిడైతే శోకాలు పెట్టింది.

"శుభం జరుగుతోంటే చూడలేవూ? కొట్టారనా, తిట్టారనా, పొమ్మన్నారనా అల్లా ఏడుస్తావు?" అంటూ ఆ ఏడుపులోనే సాధించింది. .

పెళ్ళి పదిరోజులుందనగా శుభలేఖలు అచ్చుకి యిచ్చారు. ఇచ్చేముందు ఏ మాదిరి కార్డులు వేస్తే బాగుంటుందని ఆయన మేనమామతో కలిసి ఆలోచిస్తుంటే రుక్మిణి విన్నది. కసి పట్టలేక "అవసరార్థం చేసుకునే ఈ కార్యానికి పెద్ద ఎన్నిక కూడా చేయాలా బాబాయిగారూ? అన్ని వేడుకలూ జరిపించాలా?" అన్నది. ఎన్నడూ లేని ధైర్యం వచ్చి, మనస్సు మొండికెత్తిపోబట్టి, ఆయన ఎదుటబడి అంత మాట అనగలిగింది.

గోపాలరావు ముఖం ఎర్రగా చేసుకున్నాడు. "పెళ్ళి అన్న తర్వాత అన్నీ సవ్యంగా జరగాల్సిందే!" అన్నాడు.

బంధువులందరిని పెళ్లికి తరలి వెళ్లడానికి రమ్మని వ్రాశారు. ఎందుకిదంతా తనని నిలువునా కోత పెట్టడానికి కాకపోతే. తనింక ఉండలేదు నడి త్రోవలో నిర్దయగా వదిలి వెళ్ళే ఆ మనిషి బ్రతుకుని, తనని వదలుకోలేని తన మమతని మరింత శపించింది.

"... ఆవిడ కూడా అక్కడే వుంటుందా?" అన్నది సత్యవతి పెత్తల్లి. రాను రాను "ఆమె"ను గురించిన ప్రశ్నలు ఎక్కువౌతున్నాయి. మల్లెపూలు తొడిమలు తీస్తున్న సత్యవతి తలవంచుకొన్నది. అమ్మ వెంటనే ఏమీ సమాధానం చెప్పలేదు.... ఆ విషయాలన్నీ అనుకున్నప్పుడల్లా కూతురు బ్రతుకు ఏమౌతుందో అని ఆమెకు భయం కలుగుతోంది.

"మేము గట్టిగా అడుగలేదు. కానీ అతని మేనమామ 'యిద్దర్ని రెండు కళ్లలాగ చూచుకుంటాడు, లోటు ఏమీ రానివ్వడు' అని చెప్పాడు" అన్నది.

సత్యవతి బుగ్గలు ఎరుపెక్కాయి. మల్లెమొగ్గలన్నీ గిన్నెలో పోసుకొని లేచింది, దారం కోసం వెతుకుతున్నట్లు. "ఇల్లారావే సత్యం... రా మరి. కూర్చో నీకు యిష్టమేనా యీ పెళ్ళి?" అనడగింది పెద్దమ్మ. సత్యవతి "ఫో పెద్దమ్మా!" అన్నది. అతి సాధారణంగా సహజంగా వచ్చే ఆ మాట విని అప్పచెల్లెళ్లిద్దరూ సంబర పడ్డారు.

"వాళ్లు కూడా శుభలేఖలు అవీ వేసుకుంటున్నారా? గృహప్రవేశం అక్కడేగా?" అన్నది పెద్దమ్మ చెల్లెలితో.

"అన్నీ సవ్యంగా చేస్తామనే అతని మేనమామ చెప్పాడు. మాటకి చెపుతాను. వాళ్ళకి వేడుక ఉందో లేదో అది వేరే సంగతి. మనకి యిది మొదట అక్కర కదా - అతనికి రెండోసారని మోజు లేకపోయినా మనకుంది. ఆ పెద్ద మనిషి వచ్చి తమకయ్యే ఖర్చంతా తామే భరిస్తామని చెప్పేసరికి, మీ మరిదికి సగం బరువు దింపినట్లయింది.

"ఎవరికోసం తెచ్చుకుంటారులే! ఇటువంటి సందర్భంలో కోరి చేసుకుంటూన్నప్పుడు ఉభయ ఖర్చులు పెట్టుకున్నా మనం ఆశ్చర్యపోనక్కరలేదు" అన్నది పెద్దమ్మ. ఇలాగ ఖర్చు గురించి, ఏర్పాట్లు గురించి తర్జనభర్జనలతో, రకరకాల ప్రశ్నలతో పెళ్ళి ఏర్పాట్లు జరుగుతున్నాయి. తను ఒక ప్రత్యేకమైన పనికోసం ఆ యింటికి వెడుతున్నాన్న యోచన మెల్లిగా సత్యవతి మనస్సులో చోటు చేసుకుంది.

పదిహేడేళ్ళ సత్యవతి జీవితంలో కొత్తదనం వస్తోంది. పరిపూర్ణత్వం వస్తోంది. భయంగా తన శరీరాన్ని చూసుకున్న సత్యవతి కళ్ళల్లో తను యింత వరకూ చూడని 'ఆమె' మెదిలింది.

తెల్లవారితే ముహూర్తం. వారంతా యింకా తరలి రాలేదు. పెళ్లికూతురు యింటి పెరటిలో మల్లె గుబురు పైన తెల్లని మల్లె మొగ్గలు పొటమరించి, నవనవలతో, కొనల వ్రేళ్ళతో ఆకాశం వేపు ఆశగా చేతులు జాపాయి. నవ్వబోయే కన్నె పాప తెల్లని పలువరసలా మెరిశాయి.

❋

ఇంట్లోని ఏ వస్తువు చూసినా ఎన్నో జ్ఞాపకాలు రేగుతున్నాయి రుక్మిణికి. ఆజన్మాంతం తను విడలేననుకొన్న వస్తువే తనది కాకుండా పోతోంది. ఆయన ఏవో పనులతో తిరుగుతోంటే, అన్నం కలుపుకుని తింటోంటే, ఆలోచనగా చూస్తోంటే, ఆదమరచి నిద్రపోతోంటే కొత్తగా చూస్తోంది రుక్మిణి. ఆయన ఏపని ఎల్లా చేస్తారో తనకి ఎంత బాగా తెలుసు! మాటల్లో, చూపులో, నడకలలో, స్పర్శలో పలికే భావాన్ని తనకి అతి సున్నితమైన స్పందనలుగా తెలుస్తాయి. తనకి - తనకి మాత్రమే తెలిసి వున్న యివన్నీ మరొక మనిషికి అంత సన్నిహిత మౌతాయంటే - గుండెల్లో మంట రేగుతోంది. ఆ మంట పెళ్ళికి తరలి వెళ్ళే వాళ్ళందరికీ ఎర్రగా కళ్ళకి కనబడదెందుకనో!

.... ముందు నాడు విచ్చిన పూలు తలలు వంచి, వడలిపోయినాయి రుక్మిణి గదిలో. పెరటిలోని లేత మొగ్గలు కోసేందుకు ఆరోజు ఎవ్వరూ లేరు. అంతా తరలి వెళ్ళారు.

**- పుస్తక ప్రపంచం**

**ఆగస్టు, 1965**

❋